నమస్తే తెలంగాణ



## లండన్ పర్యటనకు ఎమ్మెల్సీ కవిత

- బ్రిడ్జ్ ఇండియా ఆహ్వానం మేరకు పయనం
- ప్రజాస్వామ్యంలో మహిళల భాగస్వామ్యం అంశంపై నేడు ఎమ్మెల్సీ కవిత కీలకోపన్యాసం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పబ్లిక్ పాలసీకి సంబంధించి ప్రముఖ బ్రిడ్జ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురువారం లండన్‌కు బయలుదేరి వెళ్లారు. లండన్‌లోని సెంట్రల్ హాల్ వెస్ట్ మినిస్టర్‌లో శుక్రవారం 'మహిళా రిజర్వేషన్ చట్టం-ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళల భాగస్వామ్యం' అనే అంశంపై బ్రిడ్జ్ ఇండియా సంస్థ నిర్వహించే సదస్సులో కవిత కీలకోపన్యాసం చేస్తారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల కోసం జరిగిన ఉద్యమ తీరుతెన్నులు, ఈ రిజర్వేషన్ల ద్వారా జరగబోయే మేలు, చట్టసభల్లో ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళల భాగస్వామ్యం పెంచడం, రాజకీయాల్లో మహిళల పాత్ర వంటి అంశాలపై కవిత ప్రసంగిస్తారు. శుక్రవారం ఉదయం లండన్‌లోని అంబేద్కర్ హౌస్ మ్యూజియాన్ని సందర్శించనున్నారు. శనివారం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ అండ్ అలుమ్నీ యూనియన్ యూకే నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని కవిత ప్రసంగిస్తారు.

## అనారోగ్యంతో సమ్మక్క పూజారి మృతి

### మంత్రి సత్యవతిరాథోడ్ సంతాపం

తాడ్వాయి, అక్టోబర్ 5: ఆదివాసీ గిరిజన దైవం మేడారం సమ్మక్క దేవత ప్రధాన పూజారి సిద్దబోయిన లక్ష్మణ్‌రావు (48) అనారోగ్యంతో గురువారం ఉదయం మరణించాడు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురికాగా చికిత్స పొందాడు. బుధవారం రాత్రి జ్వరం తీవ్రమై ఆరోగ్యం విషమించడంతో గురువారం ఉదయం మృతిచెందాడు. ఈయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. లక్ష్మణ్‌రావు మృతి పట్ల గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. పూజారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. లక్ష్మణ్‌రావు కుటుంబాన్ని ములుగు జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి, ఎమ్మెల్యే సీతక్క పరామర్శించి ఓదార్చారు.



వికారాబాద్‌లో గురువారం నిర్వహించిన ప్రగతి నివేదన సభలో ప్రసంగిస్తున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి, కాలె యాదయ్య తదితరులు

# బీజేపీలోకి రేవంత్ జంప్ ఖాయం!

- అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగేది ఇదే
- 60 ఏండ్లలో కాంగ్రెస్ పింఛను 200
- ఆ పార్టీ 4 వేలు ఇస్తానంటే నమ్మొచ్చా?
- ఆ పార్టీకి ఓటేసి కర్ణాటక బాధపడుతున్నది
- రేవంత్, కిషన్ రాజకీయ మరుగుజ్జులు
- షాద్‌నగర్, వికారాబాద్ సభల్లో కేటీఆర్
- పలు పనులు ప్రారంభం, శంకుస్థాపనలు

రంగారెడ్డి/వికారాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ)/షాబాద్: 'వచ్చే ఎన్నికల్లో కాంగ్రెసోళ్లు గెలిచేది పదో, పన్నెండు మందో ఉంటారు. ఎన్నికలయ్యాక వారితో ఈ గాడ్సే (రేవంత్‌రెడ్డి) బీజేపీలోకి జంప్ అవటం ఖాయం' అని మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ ఆరెస్సెస్ మనిషి అని పంజాబ్ మాజీ సీఎం అమరీందర్‌సింగ్ స్వయంగా సోనియాకు లేఖ రాశారని గుర్తుచేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో రూ.270 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం షాద్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన ప్రగతి నివేదన బహిరంగ సభ నిర్వహించారు. ఆ తర్వాత వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రూ.173 కోట్లతో గిరిజన భవన్, స్కిల్ డెవలప్‌సెంటర్, రైల్వే ఓవర్ బ్రిడ్జి, రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల పైలాన్‌ను మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎ మ్మెల్యేలు ఆనంద్, పైలట్ రోహిత్‌రెడ్డి, కాలె యాదయ్య, మహేశ్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ రెండు సభల్లో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కనుగోలు, కొనుగోలును పెట్టుకొని డ్రామాలు ఆడుతున్నదని, ఓటుకు నోటు కేసులో దొరికిన థర్డ్ డిగ్రీ దొంగ రేవంత్ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజకీయ మరుగుజ్జులైన రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డితో సీఎం కేసీఆర్‌కు పోటీనా? అని ప్రశ్నించారు. 11 సార్లు గెలిపిస్తే ఏం చేయని కాంగ్రెస్.. ఇప్పుడు ఆరు గ్యారెంటీలు అంటూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నదని మండిపడ్డారు. కర్ణాటక ప్రజలు ఆ పార్టీకి ఓటేసి ఇప్పుడు బాధపడుతున్నారని వెల్లడించారు.



వికారాబాద్‌లో గురువారం నిర్వహించిన ప్రగతి నివేదన సభకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

> అంజయ్య యాదవ్ సౌమ్యుడు. ఆయనను గెలిపిస్తే సిద్దాపురం దగ్గర ఉన్న 334 ఎకరాల్లో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేస్తాం. షాద్‌నగర్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్డు రావటంతో అసలైన హైదరాబాద్ ఈ ప్రాంతంలోనే కొలువు దీరనున్నది.
>
> - మంత్రి కేటీఆర్

### బీ టీంగా ఉండాల్సిన కర్మ మాకేంటి?

'కాంగ్రెసోళ్లు వచ్చి మేం బీజేపీకి బీ టీం అంటరు. బీజేపోళ్లు వచ్చి మేం కాంగ్రెస్‌కు బీ టీం అంటరు. ప్రజల దయ ఉన్నన్ని రోజులు తెలంగాణ ప్రజలకు మేం ఏ-టీంగా ఉంటాం తప్ప ఏ అడ్డమైనోనికో బీ టీంగా ఉండాల్సిన కర్మ పట్టలేదు' అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలో ఉన్నదంతా రెండెకరాల రైతులేనని, వీళ్లకెందుకు 24 గంటల కరెంటు అని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ త్వరలోనే మ్యానిఫెస్టోను ప్రకటిస్తారని, ప్రతిపక్షాల మ్యానిఫెస్టోకు తాతలాంటి మ్యానిఫెస్టో రాబోతున్నదని పేర్కొన్నారు. ఆశావర్కర్లు అంటే ప్రభుత్వానికి గౌరవం ఉన్నదని, కరోనాలో ప్రాణాలను అడ్డుపెట్టి సేవలు అందించారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వనంత గౌరవ వేతనం ఇస్తున్నామని, మళ్లీ సీఎం కేసీఆర్‌ను గెలిపిస్తే మరింత సేవ చేస్తామని తెలిపారు.

### కాంగ్రెస్ హామీలను నమ్మే పరిస్థితి లేదు: పట్నం


ప్రజలు కాంగ్రెస్ పార్టీని, ఆ పార్టీ హామీలను నమ్మే పరిస్థితిలో లేరని గనులు, భూగర్భవనరులశాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీకి ఓటు అడిగే హక్కులేదని, బీఆర్ఎస్‌కు మాత్రమే ఆ హక్కు ఉన్నదని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించటం ఖాయమని తేల్చి చెప్పారు. గత తొమ్మిదేండ్లలో రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ దూసుకుపోతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు గడ్డం రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రావు, ఎమ్మెల్యేలు డాక్టర్ మెతుకు ఆనంద్, అంజయ్యయాదవ్, కాలె యాదయ్య, కొప్పుల మహేశ్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తీగల అనితాహరినాథ్ రెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, మాజీ ఎమ్మెల్యే ఇంద్ర, బీఆర్ఎస్ నేతలు గౌండ్ల నాగేందర్‌గౌడ్, పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, కొప్పుల అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

> క్రిస్టియన్, మైనార్టీలను వ్యతిరేకించే వాళ్లకు నిండా విషమే ఉంటుంది. అందుకే కాంగ్రెస్ విషయంలో మైనార్టీలు జాగ్రత్తగా ఆలోచించాలి. హిందూ, ముస్లిం, క్రిస్టియన్, సిక్కు ఇలా ఎవరనేది చూడకుండా సీఎం కేసీఆర్ అందరినీ కడుపున పెట్టుకుని చూసుకుంటున్నారు.
>
> - మంత్రి కేటీఆర్

### శభాష్ అవినాశ్!

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో గత వారం మంత్రి కేటీఆర్ పర్యటన రోజు సభకు వచ్చి ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అంతారం గ్రామానికి చెందిన ఈగ సురేందర్‌రెడ్డి కుటుంబానికి షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అండగా నిలిచారు. గురువారం మంత్రులు కేటీఆర్, పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునితామహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరుల చేతుల రూ.10 లక్షల చెక్కును సురేందర్‌రెడ్డి కుటుంబానికి అందజేశారు. బీఆర్ఎస్ తరఫున మరో రూ.2 లక్షలు ఇస్తామని కేటీఆర్ ప్రకటించారు. పార్టీ కార్యకర్త కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చిన జడ్పీటీసీని మంత్రి శభాష్ అవినాశ్ అని అభినందించారు.

## లోకం పోకడ




కుర్చీ, బల్లలు లేవు.. అడ్జెస్ట్ అవ్వండి!

## 2.19 కోట్ల విలువైన బంగారం పట్టివేత

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 5: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.2.19 కోట్ల విలువైన బంగారాన్ని గురువారం కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. దుబాయ్ నుంచి వచ్చిన ఐదుగురు ప్రయాణికులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా, సీట్ల కింద, దుస్తుల మధ్య పెట్టుకొని బంగారాన్ని తీసుకొచ్చినట్టు గుర్తించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని, మూడు కిలోల 734 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. మరో వ్యక్తి 20 వేల యూఎస్ డాలర్స్‌ను బహ్రెయిన్‌కు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. వాటి విలువ భారత కరెన్సీలో రూ.16.46 లక్షలు ఉంటుందని వివరించారు.

## వర్షకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 38.1°c | 23.8°c |
| ఆదిలాబాద్ | 37.1°c | 21.5°c |
| రంగారెడ్డి | 35.2°c | 19.0°c |
| మెదక్ | 35.2°c | 18.4°c |
| మహబూబ్‌నగర్ | 35.0°c | 19.0°c |
| ఖమ్మం | 34.0°c | 24.0°c |
| వరంగల్ | 34.0°c | 23.0°c |
| నిజామాబాద్ | 33.9 °c | 23.3°c |
| కరీంనగర్ | 33.0°c | 23.0°c |
| హైదరాబాద్ | 32.9°c | 21.4°c |

# హైదరాబాద్‌కు ప్రపంచ కీర్తి

## ఈగ వాలినా మనమంతా నష్టపోతాం

- ఏ చిన్న సమస్య లేకుండా పది సంవత్సరాలు పాలించాం
- సూపర్‌స్టార్ రజనీకాంత్ లాంటి ప్రముఖులు కీర్తిస్తున్నారు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు ఏమివ్వని బీజేపీకి ఎన్నికల్లో గుండు సున్నా ఇద్దాం
- కూకట్‌పల్లి ప్రగతి నివేదన సభలో ఐటీ మంత్రి కేటీఆర్ పిలుపు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా పేద ప్రజల అభివృద్ధి గీటురాయిగా పనిచేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. పది సంవత్సరాలుగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నగరాభివృద్ధికి పాటుపడ్డామని తెలిపారు. గురువారం మంత్రి కేటీఆర్ కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రగతి నివేదన సభ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. మెరుగైన శాంతి భద్రతలు, నిరంతర విద్యుత్తు సరఫరా, సమృద్ధిగా తాగునీరు, రవాణా, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకొని హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతున్నట్టు వెల్లడించారు. సుభిక్షంగా ఉన్న హైదరాబాద్‌లో ఈగ వాలినా అందరం నష్టపోతామని, పనిచేసే ప్రభుత్వాన్ని ప్రోత్సహించాలని ఆయన కోరారు. 22 ఏండ్ల తర్వాత హైదరాబాద్‌కి వచ్చిన తమిళనాడు నటుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ హైదరాబాద్‌లో ఉన్నామా? న్యూయార్క్‌లో ఉన్నామా? అని ఆశ్చర్యపోయారని చెప్పారు. దేశవ్యాప్తంగా హైదరాబాద్ అభివృద్ధిపై ప్రశంసలు అందుతుంటే ప్రతిపక్ష పార్టీలు మాత్రం గుర్తించలేకపోతున్నాయని మండిపడ్డారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూసి మరోసారి ప్రజల ఆశీర్వాదం కోరుతున్నామని అన్నారు.

> ప్రధాని మోదీ రూపాయి విలువను ఆకాశంలోకి తీసుకెళ్లి ప్రజలను ఆగం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిందేమీ లేదు. అలాంటి పార్టీకి ఎన్నికల్లో గుండు సున్నా ఇద్దాం.
>
> - మంత్రి కేటీఆర్

### హైదరాబాద్‌కు వన్నె తెచ్చాం

పదేండ్ల క్రితం ఏమైతదో అన్న అనుమానాల నుంచి తలసరి ఆదాయంలో నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. రాష్ట్రం ఏర్పడకముందు రూ.1.12 లక్షల తలసరి ఆదాయం ఉంటే నేడు రూ.3.17 లక్షలతో నంబర్ వన్ స్థానంలో నిలిచిందని వివరించారు. ఐటీ వృద్ధి రేటులో బెంగళూరును దాటామని, 3.20 లక్షల ఉద్యోగాల నుంచి 10 లక్షల మంది ఉద్యోగాల కల్పనకు ఎదిగామని వెల్లడించారు. వ్యాక్సిన్సలో భారతదేశం ఉత్పత్తిలో 40 శాతం హైదరాబాద్ నుంచే అవుతుండటం గర్వకారణమని అన్నారు. త్వరలోనే రూ.5 వేల కోట్లతో ఎస్ఎన్‌డీపీ రెండో దశ పనులు చేపడతామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయం, అమరువీరుల స్మారకం, 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహం ఇలా హైదరాబాద్‌కు వన్నె తీసుకువచ్చే నిర్మాణాలు చేపట్టినట్టు వివరించారు. తొమ్మిదిన్నరేండ్లలో హైదరాబాద్‌లో నిరంతర విద్యుత్తు, సమృద్ధిగా నీరు, ఫ్లైఓవర్లు,అండర్‌పాస్‌లు, ఎఫ్‌వోబీలు, పార్కులు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, 2052 వరకు మంచినీటికి తిప్పలు లేకుండా చేశామని తెలిపారు. దీనితోనే సంతృప్తి చెందటం లేదని, ప్రతి రోజు 24 గంటల నీరు అందించటమే లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు, ఎమ్మెల్సీ కే నవీన్‌కుమార్, కార్పొరేటర్లు శ్రీనివాస్‌రావు, నర్సింహాయాదవ్, సబిహా, శిరీషాబాబురావు, సత్యనారాయణ, మహేశ్వరి, పండాల సతీశ్, ఆవుల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

> కేసీఆర్‌ను ఓడించాలి అంటున్న ఈ ప్రతిపక్ష పార్టీలకు బుద్ధి చెప్పాలి. హైదరాబాద్‌కు ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చినందుకు ఓడించాలా? 70 లక్షల మంది రైతులకు రైతుబంధు ఇచ్చినందుకా? సర్కార్ దవాఖానకు రాను బిడ్డో అన్న పరిస్థితుల నుంచి సర్కారీ దవాఖానలోనే ప్రసూతి కావాలనే స్థితికి తీసుకువచ్చినందుకా?
>
> - మంత్రి కేటీఆర్

# ప్రభుత్వ సంస్థల రక్షకుడు కేసీఆర్

- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, విజయ మెగా డెయిరీ నిర్మాణమే నిదర్శనం
- ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం
- లీటరు పాలకు 4 ఇన్సెంటివ్ బకాయి
- విజయ మెగా డెయిరీ ప్రారంభంలో పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతుంటే, సీఎం కేసీఆర్ మాత్రం వాటిని కాపాడుతూ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం, విజయ మెగా డెయిరీ నిర్మాణమే ఇందుకు నిదర్శనమని వెల్లడించారు. గురువారం రావిర్యాలలో నిర్మించిన విజయ మెగా డెయిరీని మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితాఇంద్రారెడ్డి, మహేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద డెయిరీని రెండేండ్లలోనే పూర్తి చేయటం అభినందనీయమని అన్నారు. తెలంగాణ రైతు సంస్కృతిలో పాడి-పంట సమానమని చెప్పారు. కానీ ఉమ్మడి పాలనలో ఈ సంస్కృతిని నాశనం చేశారని, విజయ డెయిరీని నిర్వీర్యం చేసే కుట్ర చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ వచ్చాక విజయ డెయిరీ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఒకప్పుడు రోజుకు 1.5 లక్షల లీటర్ల పాలను మాత్రమే సేకరించే విజయ డెయిరీ ఇప్పుడు 4 లక్షల లీటర్లకు పెరిగిందని వివరించారు. మెగా డెయిరీ ప్రారంభంతో ఇది మరింత పెరగాల్సిన అవసరం ఉన్నదని వెల్లడించారు.



రావిర్యాలలో విజయ మెగా డెయిరీ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితాఇంద్రారెడ్డి, మహేందర్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి

### మాటలతో రైతుల ఆదాయం డబుల్ కాదు


2022 వరకు దేశంలోని రైతులందరి ఆదాయం డబుల్ చేస్తానని 2014 ఎన్నికల్లో మోదీ హామీ ఇచ్చారని, మరి ఆదాయం డబుల్ అయిందా? అని రైతులను కేటీఆర్ ప్రశ్నించారు. కాలేదంటూ రైతులంతా పెద్దఎత్తున నినాదాలు చేశారు. మోదీ చెప్పే ఊకదంపుడు మాటలు, ఉపన్యాసాలతో రైతుల ఆదాయం డబుల్ కాదని అన్నారు. సీఎం కేసీఆర్‌లా రైతులపై ప్రేమ, వారికి ఏదైనా చేయాలన్న తపన ఉంటేనే రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని తెలిపారు. మోదీ రైతు వ్యతిరేక నిర్ణయాలతో దేశ రైతాంగం కష్టాల్లో ఉంటే, సీఎం కేసీఆర్ సంక్షేమ నిర్ణయాలతో తెలంగాణ రైతులు సంతోషంగా ఉన్నారని వెల్లడించారు. రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నదని స్పష్టం చేశారు. రైతులకు ఇప్పటికే రూ.75 వేల కోట్ల రైతుబంధు ఇచ్చామని, ఏటా రూ.10 వేల కోట్లతో ఉచిత విద్యుత్తు ఇస్తున్నామని, రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేస్తున్నామని, రైతుబీమా ఇస్తున్నామని వివరించారు. పాడి రైతులకు త్వరలోనే లీటరుకు రూ.4 చొప్పున ఇచ్చే పాల ప్రోత్సాహక బకాయిల్ని విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పాడి రైతులకు ఇప్పటికే ప్రోత్సాహకం కింద రూ.350 కోట్లు ఇచ్చామని, ఇంత భారీ మొత్తంలో ఇచ్చిన ప్రభుత్వం మరే రాష్ట్రంలో లేదని పేర్కొన్నారు.

### సీఎం చొరవతోనే విజయ డెయిరీ బతికింది: తలసాని

సీఎం కేసీఆర్ చొరవతోనే విజయ డెయిరీ బతికిందని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో నష్టాల్లో ఉన్న విజయ డెయిరీని సీఎం లాభాల్లోకి తీసుకొచ్చారని తెలిపారు. ఒకప్పుడు విజయ డెయిరీకి 35 వేల మంది పాడి రైతులే ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 1.5 లక్షలకు చేరిందని వివరించారు. పాల సేకరణ 1.37 లక్షల టన్నుల నుంచి 4 లక్షల టన్నులకు పెరిగిందని వెల్లడించారు. ప్రస్తుతం తార్నాకలో ఉన్న విజయ ప్లాంట్ సరిపోదనే మెగా డెయిరీ నిర్మించాలని కేసీఆర్ నిర్ణయించారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్, నవీన్, జిల్లా చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, విజయ డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ సోమా భరత్‌కుమార్, పశు సంవర్ధకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అధర్ సిన్హా, టీఎస్ఎల్డీఏ సీఈవో మంజువాణి, కలెక్టర్ హరీశ్, తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

> సీఎం కేసీఆర్ పాడిని, పంటను ప్రోత్సహిస్తున్నారు. అందుకే రాష్ట్రంలో 5 విప్లవాలు వెల్లివిరుస్తున్నాయి. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాలను వెనక్కినెట్టి తెలంగాణ ముందు నిలిచింది. రాష్ట్రంలో హరిత విప్లవం వచ్చింది. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకంతో భారీగా మత్స్య సంపద పెరిగి నీలి విప్లవం వచ్చింది. పాల ఉత్పత్తి భారీగా పెరిగింది, ఇప్పుడు మెగా డెయిరీతో శ్వేత విప్లవం వస్తుంది. గొర్రెల పంపిణీతో భారీగా మాంసం ఉత్పత్తి పెరిగి పింక్ విప్లవం వచ్చింది. ఆయిల్ పామ్ సాగుతో ఎల్లో విప్లవం వచ్చింది.
>
> - మంత్రి కేటీఆర్

## సిక్కిం వరదల్లో ఆర్మీ జవాన్ మృతి



బోధన్, అక్టోబర్ 5: సిక్కిం రాష్ట్రంలోని తీస్తా నదికి ఆకస్మికంగా వచ్చిన వరదలో 23 మంది భారత జవాన్లు, సైనిక అధికారులు బుధవారం కొట్టుకుపోయారు. వారిలో ఒకరైన నిజామాబాద్ జిల్లా సాలూరా మండలం కుమ్మన్‌పల్లికి చెందిన ఆర్మీ జవాన్ లాన్స్‌నాయక్ నీరడి గంగాప్రసాద్ (27) మృతిచెందారు. ఆయన భౌతికకాయం గురువారం లభ్యమైంది. గంగాప్రసాద్ మృతితో కుమ్మన్‌పల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. గంగాప్రసాద్ భార్య శిరీషతో కలిసి పశ్చిమబెంగాల్ సరిహద్దులో నివాసం ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. గంగాప్రసాద్ గల్లంతు వార్తను సైనిక అధికారుల ద్వారా తెలుసుకున్న ఆయన తమ్ముడు సాయిసుధాకర్, మరో కజిన్ దిలీప్ సంఘటనా స్థలానికి బుధవారం రాత్రి విమానంలో బయలుదేరి వెళ్లారు. అక్కడ గంగాప్రసాద్ భార్య శిరీషను కలుసుకున్న అనంతరం.. వారిని సైనిక అధికారులు గంగాప్రసాద్ భౌతికకాయం లభ్యమైన చోటుకు తీసుకెళ్లి చూపించారు. గంగాప్రసాద్ భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం లేదా శనివారం ఉదయం కుమ్మన్‌పల్లికి తీసుకొచ్చే అవకాశం ఉంది. కుమ్మన్‌పల్లిలో గంగాప్రసాద్ భౌతికకాయానికి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న బోధన్ ఎమ్మెల్యే షకీల్ గంగాప్రసాద్ మృతికి సంతాపం తెలుపుతూ ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

## నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

### టీచింగ్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేతాజీ సుభాష్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 322
- పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్
- అర్హతలు, ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 27
- వెబ్‌సైట్: https://www.nsut.ac.in

### సీఎంఎస్ఎస్‌లో...

సెంట్రల్ మెడికల్ సర్వీసెస్ సొసైటీ (సీఎంఎస్ఎస్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 8
- పోస్టులు: అసిస్టెంట్ జనరల్ మేనేజర్, మేనేజర్
- విభాగాలు: లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్, ఫైనాన్స్, ప్రొక్యూర్‌మెంట్, ఐటీ
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 10
- వెబ్‌సైట్: www.cmss.gov.in

### టెక్నీషియన్లు

ఐసీఎఫ్ఆర్ఈ-ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 14
- పోస్టులు: టెక్నికల్ అసిస్టెంట్, టెక్నీషియన్, డ్రైవర్ తదితరాలు
- దరఖాస్తు, చివరితేదీ, ఎంపిక తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- వెబ్‌సైట్: http://iwst.icfre.gov.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- గ్రూప్స్ ప్రత్యేకం జనరల్ స్టడీస్, చరిత్ర, కరెంట్ అఫైర్స్ కోసం పైన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.